# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 02-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేశామని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, గ్రీస్ ప్రధానమంత్రి కిరియాకోస్ మిత్సోటాకిస్ పునరుద్ఘాటించారు.

- ❖ భారతదేశం ఈరోజు ప్రపంచ మిత్రదేశంగా నిలుస్తోందని విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ అన్నారు.

- ❖ జమ్మూకాశ్మీర్ లో ఉగ్రవాదులకు ధీటైన బదులిస్తామని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

- ❖ కాశ్మీర్ లోయలో, దక్షిణ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలోని హల్కాన్ గలి ప్రాంతంలో ఈ రోజు భద్రతా దళాల కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు మరణించారు.

- ❖ రానున్న 2, 3 రోజులలో ఉత్తర, తూర్పు భారతదేశంలో కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) వెల్లడిచింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు తమ నిబద్ధతను భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, గ్రీస్ ప్రధానమంత్రి కిరియాకోస్ మిత్సోటాకిస్ పునరుద్ఘాటించారు. ఈ రోజు వారిరువురి మధ్య జరిగిన టెలిఫోనిక్ సంభాషణలో... భారతదేశం-మిడిల్ ఈస్ట్-యూరోప్ ఆర్థిక కారిడార్, పశ్చిమాసియాలో పరిణామాలతో సహా వివిధ ప్రాంతీయ, ప్రపంచ ఆసక్తికర సమస్యలపై ఇరుదేశాల నాయకులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఇటీవలి అత్యున్నత స్థాయి చర్చల ద్వారా ద్వైపాక్షిక సంబంధాలు ఊపందుకోవడాన్ని ఇరువురు నేతలు అభినందించారు. అంతే కాకుండా వాణిజ్యం, రక్షణ, షిప్పింగ్, కనెక్టివిటీతో సహా ద్వైపాక్షిక సహకారానికి సంబంధించి అనేక రంగాల్లో పురోగతిని వారు సమీక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం ఈరోజు ప్రపంచ మిత్రదేశంగా నిలుస్తోందని విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ అన్నారు. ఈ రోజు న్యూఢిల్లీలో జరిగిన ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కేంద్రమంత్రి ప్రసంగిస్తూ... భారతదేశం వీలైనన్ని ఎక్కువ దేశాలతో స్నేహం చేయాలని కోరుకుంటుందని తెలిపారు. సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత వంటి సున్నిత అంశాలు భాగస్వాములను అంచనా వేయడంలో ఎల్లప్పుడూ నిర్ణయాత్మకంగా ఉంటాయని డాక్టర్ జైశంకర్ పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాఖండ్‌లోని చార్ ధామ్‌లలో ఒకటైన గంగోత్రి ధామ్ మహాద్వారాన్ని శీతాకాలం కోసం ఉత్తరకాశీ జిల్లాలో అన్నకూట్ పండుగ సందర్భంగా మూసివేశారు. ఈ రోజు మధ్యాహ్నం 12 గంటల 14 నిమిషాలకు అభిజిత్ ముహూర్తం సందర్భంగా పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తుల సమక్షంలో ఆలయ తలుపులు మూసేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని బంతిపూలతో అలంకరించారు. కాగా ఈ ఏడాది ఇప్పటివరకు 8 లక్షల మంది యాత్రికులు ఉత్తరకాశీ జిల్లాలోని గంగోత్రి ధామ్‌ను సందర్శించారు. ఇదిలా ఉండగా రుద్రప్రయాగ్‌లోని కేదార్‌నాథ్ ధామ్, ఉత్తరకాశీలోని యమునోత్రి ధామ్ పోర్టల్‌లను మూసివేయడానికి సన్నాహాలు ప్రారంభించారు. రేపు భాయ్ దూజ్ రోజు సందర్భంగా రెండు ధామ్‌ల మహాద్వారాలను కూడా మూసివేస్తారు. మరోవైపు రుద్రప్రయాగ్ జిల్లాలోని బాబా కేదార్ దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకుంటున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్‌లలో భారీ వర్షాలు కురుస్తాయని ఈరోజు భారత వాతావరణ శాఖ (IMD) అంచనా వేసింది. రాబోయే రెండు రోజుల్లో కేరళ, మహేలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. భారత వాతావరణ శాఖ అంచనా ప్రకారం, రానున్న 2-3 రోజులలో ఉత్తర, తూర్పు భారతదేశంలో కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందని తెలిపింది. ఢిల్లీ, జాతీయ రాజధాని ప్రాంతంలో రేపటి వరకు రాత్రి, ఉదయం వేళల్లో పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

జమ్ము కాశ్మీర్ లో ఉగ్రవాదులకు ధీటైన బదులు ఇస్తామని దేశ రక్షణ శాఖ మంత్రి రాజనాధ్ సింగ్ పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ కాన్పూర్ లో ఈ రోజు పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ.. జమ్ము కాశ్మీర్ వేగంగా అభివృద్ధి చెందుతున్నదని, గతంతో పోలిస్తే ఇటీవల ఉగ్రదాడులు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. ఉగ్రవాదులకు భారత సైన్యం గట్టిగా బుద్ధిచెబుతోందని, ఇప్పటి వరకు ఎందరో ఉగ్రవాదులను మట్టుపెట్టామని స్పష్టం చేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

కెనడాలో ఖలిస్థానీ సానుభుతిపరులపై దాడుల వెనుక భారత్ ప్రమేయం ఉందంటూ ఆ దేశ మంత్రి డేవిడ్ మోరిసన్ ఆరోపణలు చేయడంపై భారత్ తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఆ ఆరోపణలు పూర్తిగా అసంబద్ధమైనవని కొట్టిపారేసింది. న్యూఢిల్లీలో కెనడా హైకమిషన్ ప్రతినిధిని పిలిపించి తీవ్ర నిరసన వ్యక్తం చేసినట్లు భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఈ రోజు వెల్లడించారు. మోరిసన్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమని, అసంబద్ధమైనవని పేర్కొంటూ ఆయనకు డిప్లమాటిక్ నోట్ కూడా ఇచ్చామని రణ్‌ధీర్ జైశ్వాల్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ రేపటి నుంచి 6 రోజుల పాటు ఆస్ట్రేలియా, సింగపూర్‌లలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రి ఆస్ట్రేలియా బ్రిస్బేన్ లో భారత 4వ కాన్సులేట్‌ను ప్రారంభిస్తారు. అలాగే కాన్‌బెర్రాలో ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్‌తో కలిసి 15వ విదేశాంగ మంత్రుల ఫ్రేమ్‌వర్క్ డైలాగ్ సదస్సుకు సహ - అధ్యక్షుడుగా వ్యవహరిస్తారు. అదే విధంగా ఆస్ట్రేలియా పార్లమెంట్ హౌస్‌లో జరగనున్న 2వ రైసినా డౌన్ అండర్ ప్రారంభ సెషన్‌లో విదేశాంగ మంత్రి కీలకోపన్యాసం చేస్తారు. ఆస్ట్రేలియా పర్యటన ముగించుకొని ఈ నెల 8న సింగపూర్ చేరుకొని ఆసియాన్ - ఇండియా నెట్‌వర్క్ ఆఫ్ థింక్ ట్యాంక్ 8వ రౌండ్‌టేబుల్‌లో ఆయన ప్రసంగిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

నాలుగు రోజుల భారత్ పర్యటనకు వచ్చిన థాయ్‌లాండ్ విదేశాంగ మంత్రి మారిస్ సంగియాంపాంగ్సా ఈరోజు న్యూఢిల్లీలో విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ జైశంకర్ సామాజిక మాధ్యమ వేదికగా స్పందిస్తూ.... రాయల్ కథినా వేడుక కోసం థాయ్ విదేశాంగ మంత్రి పర్యటన రెండు దేశాల మధ్య సుదీర్ఘమైన చారిత్రక సాంస్కృతిక సంబంధాలకు ఉదాహరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా భారత్-థాయ్‌లాండ్ సంబంధాలు, బహుపాక్షిక సహకారం, ప్రాంతీయ పరిణామాలపై వారు చర్చించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

కాశ్మీర్ లోయలో, దక్షిణ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలోని హల్కాన్ గలి ప్రాంతంలో ఈ రోజు భద్రతా దళాల కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు మరణించారు. కొంతమంది ఉగ్రవాదుల ఉనికి గురించి నిర్దిష్టమైన సమాచారం అందుకున్న పోలీసులు భద్రతా దళాలు ప్రత్యేక ఆపరేషన్ ప్రారంభించాయి. హల్కాన్ గాలి సమీపంలో అనుమానాస్పద కదలికను గమనించి అప్రమత్తమైన దళాలపై ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారని, సైనకులు సమర్థవంతంగా స్పందించి ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చారని అధికారులు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికాలోని కొలరాడోలో జరుగుతున్న అండర్-19 ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారిణి క్రిషా వర్మ బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. క్రిషా 5-0 పాయింట్లతో జర్మనీకి చెందిన లెరికా సైమన్‌ను ఓడించి స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. పురుషుల 75 కేజీల విభాగంలో పోటీపడుతున్న రాహుల్ కుందు కూడా తన కేటగిరీ ఫైనల్‌లో అమెరికాకు చెందిన జోసెఫ్ అవినోంగ్యా చేతిలో 1-4తో ఓడిపోయి రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. ఇక మహిళల 57 కేజీల విభాగంలో, టోర్నీ ద్వారా ఆకట్టుకునే ప్రదర్శనలు కనబరిచిన అంజలి సింగ్, ఫైనల్లో ఇంగ్లండ్‌కు చెందిన మియా-తియా ఐటన్ చేతిలో 0-5 తేడాతో ఓటమి పాలైంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ముంబయిలోని వాంఖడే వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న మూడవ క్రికెట్ టెస్టులో భారత్ పట్టుబిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్.. 263 పరుగులకు ఆలౌట్ అవ్వడంతో 28 పరుగుల స్వల్ప ఆధిక్యాన్ని సాధించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన న్యూజిలాండ్ జట్టు.. రెండో రోజు అయిన ఈరోజు ఆట ముగిసే సమయానికి 9 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. ప్రస్తుతం కివీస్ 143 పరుగుల ఆధిక్యంలో ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =